మంగళవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.5°C | కనిష్ఠం : 22.0°C

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం సా : 6.31 గం..
సహర్ : గురువారం ఉ : 5.03 గం..

# జలం.. జటిలం



దోర్నకల్ మండలంలో ఎండిపోయిన వాగు



కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి శివారులో పొట్ట దశకు వచ్చిన వరిపొలం

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి12 : ఎండల తీవ్రత పెరుగుతోంది. అంతకంతకూ భూగర్భ జలమట్టం పడిపోతోంది. దీంతో నీటిసమస్య తీవ్రమవుతోంది. బావులు, బోర్లలో నీటిమట్టం తగ్గిపోతుండగా.. వాగులు, వంకలు ఎండిపోయి చెరువులు, కుంటలు కళతప్పుతున్నాయి. దానికి తోడు ఈనెల 23వ తేదీ నుంచి ఎస్సారెస్పీ డీబీఎం-48 కెనాల్‌కు నీటి సరఫరా బంద్ కానుంది. అలాగే ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఎస్సారెస్పీ డీబీఎం-60 కాలువల ద్వారా కూడా నీటిని నిలిపేయనున్నారు. దీంతో భూగర్భ జలాలు మరింత తగ్గి.. జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడి తీవ్రమవనుందన్న ఆందోళన అందరిలోనూ ఉంది. మున్ముందు వేసవిలో పరిస్థితెలా ఉంటుందోనని, మరీ ముఖ్యంగా ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు చేతికందుతాయా లేదా అన్న ఆందోళన అందరిలోనూ కనిపిస్తోంది.

**యాసంగిలో 1.28 లక్షల ఎకరాల్లో వరి సాగు..**

జిల్లాలో ఈ యాసంగిలో 1.28లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతోంది. గతేడాది యాసంగిలో 1.43 లక్షల ఎకరాల వరకు సాగయింది. అంటే ఈసారి 15వేల ఎకరాల వరకు తక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకుంది. ఏప్రిల్ చివరివారం వరకు కొన్ని మండలాల్లో ముందుగా వేసిన వరిపంట కోతకు వస్తుంది. అలాంటి పొట్ట దశలో ఉన్న సమయంలో చిన్నగూడూరు, నెల్లికుదురు, మహబూబాబాద్, డోర్నకల్ చివరి ఆయకట్టు మండలాల్లో నీటి సమస్య తీవ్రమవుతోంది. బోర్లలో కూడా నీటి ఉధృతి తగ్గిపోవడంతో మరో పది, పదిహేను రోజుల్లో నీటి సమస్య తీవ్రం కానుంది.

**వరి వేయొద్దని అధికారులు చెప్పినా..**

ఎస్సారెస్పీ లోయర్ మానేరు డ్యాం రిజర్వాయర్లలో తగినంత నీటి లభ్యతలేదని, నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని, చివరి ఆయకట్టు వరకు నీరు అందించలేమని నీటిపారుదల శాఖ అధికారులు యాసంగి ప్రారంభానికి ముందే ప్రకటించారు. అయినా రైతులు అధికారుల మాటలు లెక్కచేయకుండా అన్ని మండలాల్లో వరి సాగు చేశారు. ఇప్పుడు చివరి ఆయకట్టు వరకు నీరు అందకపోవడంతో సంబంధిత రైతులు పరేషాన్‌కు గురవుతున్నారు. నెల్లికుదురు మండలంలో ఓ రైతు నాలుగుఎకరాల్లో వరివేస్తే బోరులో నీరు అందక పోవడంతో ఒక ఎకరం మాత్రమే నీరు పారుతోంది. దాంతో మరోమూడు కొత్తబోర్లు తవ్వించిన ఒక్కదానిలో కూడా నీరు పడక పోవడంతో రైతు బోరుమంటున్నాడు. మదనతుర్తి,రామన్నగూడెం, మునీగలవీడు, నెల్లికుదురు, బ్రహ్మణ కొత్తపల్లి, చిన్నగూడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో చివరి ఆయకట్టు గ్రామాల వరకు ఎస్సారెస్పీనీరు చేరకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డోర్నకల్ మండలంలోనూ చి వరి ఆయకట్టు గ్రామాల్లో నీటి సమస్య తీవ్రతరం అవుతోంది. డోర్నకల్ మున్నేరువాగు నీరులేక ఎండిపోవడంతో ఏటిలో ఉన్న చిన్నచిన్న మడుగుల్లో నుంచి

మిగతా 8వ పేజీలో..

**రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలు**

- 5.59 మీటర్లలోతుకు పడిపోయిన నీటిమట్టం
- ఎండిపోతున్న చెరువులు, కుంటలు, వాగులు
- జిల్లాలో తీవ్రమవుతున్న నీటి సమస్య



చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి వద్ద అడుగంటిన ఆకేరువాగు

**వాగుల వెంట..** జిల్లాలో ఆకేరు, మున్నేరు, పాకాల వాగులు ఎండిపోయాయి. వాగుల వెంట ఉన్నరైతులు వాగుల్లో ఉన్న చిన్నచిన్న మడుగుల్లో నుంచి నీటి తోడుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు.

**5.59మీటర్ల లోతున జలాలు..**

మహబూబాబాద్ జిల్లాలో ఫిబ్రవరిలో 5.59 మీటర్ల లోతున భూగర్భ జలాలు పడిపోయాయి. వచ్చే మార్చి నెలలో మరో మీటరుకుపైగా పడిపోయే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా భూగర్భ జలాలు పడిపోయిన గ్రామాలైన కొత్తగూడ మండలం సాధిరెడ్డిపల్లిలో 10మీటర్ల లోతుకు పడిపోయాయి. మరిపెడ గిరిపురంలో 16.79 మీటర్లు, తానంచెర్లలో 15.43, తొర్రూరులో 10.51, బయ్యారం మండలం కొత్తగూడెంలో 10.12, మొట్లతిమ్మాపురంలో 11.20, లక్ష్మీపురం కొమ్మారంలో 10.98, గంగారం మండలం కోమట్లగూడెంలో 19.62, కొత్తగూడలో 10.25, నెల్లికుదురు మండలం చిన్ననాగారంలో 9.11 జగత్‌రావుపేటలో 8.95, నర్సింహులపేట మండలం కొమ్ములవంచలో 8.51, గంగారం మండలం మర్రిగూడెంలో 8.37, కొడిశలమిట్టలో 8.27 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి.



**ఆకేరులోకి నీరు విడుదల చేయాలి..**
- మునిగెటి యాకూబ్‌రెడ్డి, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు.

ఆకేరు పరివాహక ప్రాంతాల్లో మాకు పొలాలున్నాయి. పొలాల్లో వ్యవసాయబావులు ఉన్నా.. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పంట పొలాలకు నీరందే పరిస్థితి లేదు. పంటకు పెట్టిన పెట్టుబడి కూడ వచ్చే పరిస్థితి లేదు. మాకు ఆత్మహత్యలే శరణ్యంగా మారే పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి ఆకేరువాగులోకి నీటిని విడుదల చేయాలి.



**వరిపంట ఎండిపోతోంది..**
- బానోత్ కోటేష్, చాంప్లాతండా, డోర్నకల్

గతేడాది మున్నేరు వాగులో నీరు పుష్కలంగా ఉన్నా, ఈ ఏడాది పూర్తిగా అడుగంటిపోయింది. నీరు లేకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి నీటిని విడుదల చేయాలి.

# పార్లమెంట్ ఎన్నికలను పక్కాగా నిర్వహించాలి

- షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే నిబంధనలను అమలు చేయాలి
- పోలింగ్‌కు సిబ్బందిని సన్నద్ధం చేసుకోవాలి
- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టర్లు, అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎలక్షన్స్ షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో అమలు చేయాలన్నారు. దానికి తగిన విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం అవసరమైన మేర పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేసుకోవాలని, ఇటీవల జరిగిన బదిలీల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈవీఎం యంత్రాల మొదటిస్థాయి చెకింగ్ నివేదికలను సమర్పించాలని, 85 ఏళ్ల పైబడి వయసు గల ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో దివ్యాంగులను మ్యాపింగ్ చేసి పోలింగ్ రోజున వారికి అవసరమైన రవాణా సదుపాయాలను కల్పించాలని, నామినేషన్ దాఖలు ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని చెప్పారు.

మహబూబాబాద్ జిల్లాలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లపై పూర్తిస్థాయి కంట్రోల్ ఉండాలని, ఎన్నికల ప్రచారాన్ని ప్రచురించే ప్రతీ ఫ్లెక్సీ, కరపత్రాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని వికాస్‌రాజ్ అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిరంతరం పరిశీలించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెరిగేలా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఓటు ప్రాముఖ్యత ప్రజలకు చేరే విధంగా వినూత్నరీతిలో కార్యక్రమాలను అమలు చేయాలని, అన్నివర్గాల వారిని తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణను తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటుహక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జిల్లా అధికారులు పురుషోత్తం, సుబ్బారావు, నర్మద తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన' ఫిర్యాదుల కేంద్రానికి జనం క్యూ

**సవరణలకు అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు**



మహబూబాబాద్ ప్రజాపాలన ఫిర్యాదు కేంద్రంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, మార్చి12 : ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసేందుకు జిల్లాలోని మండల కేంద్రాల్లో తహసీల్ ఆఫీసులు, ఎంపీడీవో కార్యాలయాలు,మునిసిపాలిటీల్లో ప్రజాపాలన ఫిర్యాదుల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇటీవల ప్రభుత్వం 'గృహజ్యోతి' పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించింది. అయితే విద్యుత్ బిల్లులు కొట్టిన సమయంలో 200 యూనిట్ల కంటే తక్కువగా విద్యుత్ వినియోగించిన వినియోగదారులకు గృహజ్యోతి పథకానికి అర్హత ఉన్నప్పటికీ జీరో బిల్లు రావడం లేదు. మరోపక్క తెల్లరేషన్ కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికి గ్యాస్ సబ్సిడీ కూడా వినియోగదారులకు వర్తించడం లేదు. అయితే ప్రజాపాలన దరఖాస్తుల్లో ప్రజలు సరిగా సమాచారాన్ని పొందుపర్చకపోవడంతో పథకాల అమలుకు ఎంపిక కావడం లేదని గ్రహించిన ప్రభుత్వంఫిర్యాదుల కేంద్రాలను ఏర్పాటు చేసి, దరఖాస్తులను పునర్ పరిశీలిస్తూదరఖాస్తుల్లో తప్పులను సరిచేస్తున్నారు. ఫిర్యాదు కేంద్రాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ప్రజాపాలన రిసిప్ట్, తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంటు బిల్లు, గ్యాస్ బుక్ జిరాక్స్ ప్రతులతో ఫిర్యాదు కేంద్రానికి వెళితే అక్కడ సిబ్బంది ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్‌లో పరిశీలించి తప్పుగా వేసిన ఆధార్, రేషన్‌కార్డు, గ్యాస్ కన్జుమర్ నెంబర్లు, ఇతరత్రా వివరాలను సరిచేసి పంపిస్తున్నారు. మానుకోట మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ఫిర్యాదు కేంద్రానికి పెద్దఎత్తున వస్తున్నారు. దీంతో పురుషులకు, మహిళలకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు తలెత్తకుండా వారి దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫిర్యాదు కేంద్నాలకు ప్రజల తాకిడి ఉంటోంది.

## మునిసిపాలిటీని అభివృద్ధి చేస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- రూ.39.19కోట్లతో అంచనా బడ్జెట్
- అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపించిన సభ్యులు



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి12 : స్థానిక మునిసిపాలిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో 2024-25 బడ్జెట్ సమావేశం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన మునిసిపాలిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం శంకుస్థాపనలే తప్ప పనులు చేసిందిలేదని విమర్శించారు. మునిసిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. 39.19 కోట్ల ఆదాయం అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అభినందనీయం అన్నారు. వచ్చే వేసవిలో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బడ్జెట్ సమావేశంపై సంబంధిత మునిసిపల్ అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ సమావేశంలో ఇష్టం వచ్చిన రీతిలో కుర్చీలు వేశారని, ప్రొటోకాల్ పాటించలేదన్నారు. అదే కాకుండా మునిసిపల్ అధికారులు బడ్జెట్ సమావేశంపై మీడియాకు, సంబంధితశాఖ అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాలేదు.

ఆయా శాఖలపై ఎమ్మెల్యే చర్చించేప్పుడు అధికారులు గైర్హాజరు కావడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్‌చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తాం..**

పెద్దవంగర : రాన్నున్న పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన వైస్ ఎంపీపీ బొమ్మరబోయిన కల్పన రాజుయాదవ్, ఎంపీటీసీలు బానోతు రవీందర్, ఎర్ర సబిత, బానోతు విజయ సోమన్న, ఈరెంటి అనురాధ శ్రీనివాస్, మెట్టు సౌజన్య నాగేష్ హైదరాబాద్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీపాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. మాజీపీసీసీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, జాటోత్ నెహ్రూనాయక్, అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, గౌతమ్ రెడ్డి, సోమరాజశేఖర్ ఉన్నారు.

## నేడు నిజాం చెరువు ఎఫ్‌టీఎల్ జాయింట్ సర్వే

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 12 : మానుకోట పట్టణంలోని నిజాంచెరువు ఎఫ్‌టీఎల్‌పై రెవెన్యూ, నీటి పారుదల శాఖ, మునిసిపాలిటీల ఆధ్వర్యంలో ఎఫ్‌టీఎల్ సర్వే బుధవారం (నేడు) మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్‌లో జరుగుతుందని నీటిపారుదల శాఖ మహబూబాబాద్ డివిజన్ నెంబర్-1 డీఈ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టులో కేసు ఉన్న కారణంగా ఈసర్వే జరుగుతుందని, నిజాం చెరువు పరిధిలోని సర్వే నెంబర్లు దానిని ఆనుకుని ఉన్న భూముల యాజమానులు హస్సేనాపురం నుంచి పెద్దమ్మతల్లి వరకు ఉన్న భూముల యాజమానులు సకాలంలో ఈ సర్వేకు హాజరు కావాలని కోరారు.

## కాంగ్రెస్‌వి అమలుకాని హామీలు

**డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

డోర్నకల్, మార్చి 12 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా అమలు చేయలేని హామీలను ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే డీఎస్‌రెడ్యానాయక్ అన్నారు. డోర్నకల్ జైన్‌భవన్‌లో మంగళవారం మండల, పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2500, వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామంటూ ఎన్నో హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. కానీ, అధికారం చేపట్టి వందరోజుల్లో వాటిని అమలు చేస్తామని చెప్పి వందరోజులు పూర్తయినప్పటికి ఇంకా వాటిని ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. మండల అధ్యక్షుడు నున్న రమణ, పీఏసీఎస్ చైర్మన్లు బిక్షంరెడ్డి, సీతారామిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, కౌన్సిలర్లు బోరగళ్ల శరత్‌బాబు, పోటు జనార్దన్, కొత్త రాధిక, మౌనికజైన్, తేజావత్ సంధ్యారాణి, అంకెపాక అరుణ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐతో బీజేపీ రహస్య ఒప్పందం

- దాతలు, విరాళాల వివరాలను బహిర్గతం చేయాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



జిల్లా కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న నాగయ్య

గార్ల మార్చి 12 : కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలో నరేంద్రమోదీ ప్రభుత్వంలోని పెద్దలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో రహస్య ఒప్పందం చేసుకోవడం జరిగిందని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు జి.నాగయ్య ఆరోపించారు. గార్ల వర్తక సంఘం భవనంలో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. సుప్రీంకోర్టు ఇటీవల బీజేపీ ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని నిషేధించిందని, ఈ నేపథ్యంలో బీజేపీ, ఎస్‌బీఐతో రహస్య ఒప్పందాన్ని బట్టబయలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు పోరుకు సిద్ధం కావాలన్నారు. 2017లో ఈ పథకం ప్రవేశ పెట్టినప్పటికి నుంచి బీజేపీ సుమారు రూ.26,566 వేల కోట్లను విరాళాల రూపంలో అందుకుందని ఇందులో 55 శాంతం బాండ్ల రూపంలో ఉన్నాయని వారు ఆరోపించారు. దాతల వివరాలను బహిర్గత పర్చాలని సుప్రీంకోర్టు సూచించిన నేపథ్యంలో కార్పొరేట్ సంస్థతో తనకున్న సంబంధాలను బహిర్గతం పరిచేందుకు బీజేపీ జెంకుతుందన్నారు. దాతల సమాచారాన్ని బహిర్గతం పర్చవద్దని మోదీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై ఒత్తిడి తెస్తుందని ఆయన తెలిపారు. సంస్థల, వ్యక్తుల పేర్లను బహిర్గత పరిచేందుకు జూన్ 30 వరకు అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించారని కంప్యూటరైజ్డ్ బ్యాంకులో ఎలక్టోరల్ బాండ్‌ల సమాచారాన్ని బహిర్గతం ఐదునెలలు సమయం కోరడంలోనే మోదీ ప్రభుత్వం చేస్తున్న తప్పులు కప్పిపుచ్చుకోవడమే అన్నారు. అక్రమ వసూళ్లతో దేశంలో మరోసారీ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నరేంద్రమోదీ ప్రభుత్వం కుటీల ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. బీజేపీ వేస్తున్న ఎత్తులను రాబోయో లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు వామపక్ష ప్రజాతంత్ర శక్తులుతిప్పి కొట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సూర్జపు సోమయ్య, కందునూరి శ్రీనివాస్, అలవాల వీరన్న, బొమ్మన అశోక్ కుమార్, మండా రాజన్న, సీతరాం, మధు, కోటయ్య, బి.హరి నాయక్, మల్లేశం శ్రీను పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చడంలో విఫలం

- ప్రభుత్వంపై మాజీ మంత్రి దయాకర్ రావు వ్యాఖ్య




సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్ రావు

తొర్రూరు, మార్చి 12 : కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని రాష్ట్ర మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. మంగళవారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, స్థానిక ఎమ్మెల్యేకు అవగాహన లేకపోవడం, అసమర్థత వల్ల పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, జడ్పీటీసీ శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట పార్లమెంట్‌లో సత్తా చాటుతాం

- ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ లింగయ్యదొర



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్యదొర

నెహ్రూసెంటర్, మార్చి 12 : మహబూబాబాద్ పార్లమెంట్‌లో ఆదివాసీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తమ అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలిపి, సత్తాచాటుతామని ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ చంద లింగయ్యదొర అన్నారు. జిల్లా కేంద్రంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అధ్యక్షతన మంగళ వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహ బూబాబాద్ పార్ల మెంట్‌లో ఆదివాసీలు అత్యధికంగా ఉన్నారని, ఐనా మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్‌ను ప్రధాన పార్టీ ఆదివాసీలకు కాకుండా బంజరాలకు కేటాయించారని ఆరోపించారు. వరుసగా బంజరాలకే కేటాయిస్తూ ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బంజరాలకు టికెట్‌లు ఇచ్చిన ప్రధాన రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి ఆయా అభ్యర్థులను ఓడిస్తామన్నారు. ఈ సమావేశంలో రమణాల లక్ష్మయ్య, పాడెం రత్నం, కోడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, పొడెం కృష్ణ ప్రసాద్, కోటి రవి, వాసం రామకృష్ణ, బూర్క యాదగిరి, వట్టం కన్నయ్య, వట్టం జనార్దన్, చంద మహేష్, వజ్జ నర్సింహారావు, గొగ్గుల రామకృష్ణ, సోయం శుక్రం, కల్తీ నరేష్, కొమురం శ్రీను, చంద నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నుంచి నలుగురి సస్పెన్షన్

గూడూరు, మార్చి 12 : బీఆర్‌ఎస్ నుంచి జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, బొద్దుగొండ మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, కోబల్‌తండాకు చెందిన బోడ భాస్కర్, వెంగంపేటకు చెందిన శోభారెడ్డిలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు వేంవెంకటకృష్ణారెడ్డి, నూకల సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్నిరోజులుగా పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనుంచి బీఆర్‌ఎస్ పార్టీకి, వారికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

# ఎన్‌పీడీసీఎల్ ఈఈలు (సివిల్) బదిలీ

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా తెలంగాణ రాష్ట్ర నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయానికే పరిమితమైన సివిల్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)లకు ఎట్టకేలకు విముక్తి లభించింది. వారు తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లి విధులు నిర్వహించే అవకాశం ఏర్పడింది. కార్పొరేట్ ఆఫీసులోని ఐదుగురు సివిల్ ఈఈలను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం పరిధిలో పనిచేస్తున్న ఈఈ (సివిల్) వెంకటేశ్వర్‌ను హనుమకొండ హెడ్‌క్వార్టర్‌లో ఎస్ఈ ఆపరేషన్‌కు మార్చారు. ఈయన హనుమకొండ, వరంగల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ సర్కిళ్ల పరిధిలోని సివిల్ పనులను పర్యవేక్షిస్తారు.

ఇదే కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-1) పరిధిలో పనిచేస్తున్న మరో ఈఈ (సీవిల్) కె.శ్రీనివాస్‌ను కరీంనగర్ హెడ్‌క్వార్టర్ ఎస్ఈ ఆపరేషన్ ఆఫీసుకు స్థాన చలనం చేశారు. ఈయన కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి ఆపరేషన్ సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ సివిల్ పనులను చూస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-11) కింద పని చేస్తున్న ఈఈ (సివిల్) జి వెంకటేశ్వర్లును ఖమ్మం హెడ్‌క్వార్టర్‌లోని ఎస్ఈ (ఆపరేషన్) కార్యాలయానికి డైవర్ట్ చేశారు. ఈయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఆపరేషన్ సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీఈ కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో పని చేస్తున్న ఈఈ (సివిల్) కోమిరెడ్డి స్వామిని నిజామాబాద్ ఎస్ఈ (ఆపరేషన్) ఆఫీసుకు మార్చారు. ఆయన నిజామాబాద్ కామారెడ్డి సర్కిళ్లను, అలాగే కార్పొరేట్ ఆఫీసులో ఎస్ఈ/క్వాసీ అండ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న ఈఈ (సివిల్) పి.జానార్దన్‌రావును ఆదిలాబాద్ జిల్లా ఎస్ఈ ఆఫీసుకు బదిలీ చేశారు.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సివిల్ పనులను పర్యవేక్షించాల్సిన వీరిని గత సీఎండీ గోపాల్‌రావు ఏడేళ్ల కిందట కార్పొరేట్ ఆఫీసుకు తీసుకువచ్చారు. దీనితో వీరికి పనిలేకుండా పోయింది. కొత్త సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి వరుణ్ రెడ్డి ప్రక్షాళన చేపట్టారు. కార్పొరేట్ ఆఫీసులోని ఈఈ (సివిల్)లను ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల సర్కిళ్లకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

# గుదిబండగా కరెంటు ఒప్పందాలు

**ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం**

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

### ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రిబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

## ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




# మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు


పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.


అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

## అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్‌ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.










## మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

## రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

| పోస్టులు | ఖాళీల సంఖ్య | వేతనం (రూ.లలో) |
|---|---|---|
| ప్రొఫెసర్ | 498 | 1,90,000 |
| అసోసియేట్ ప్రొఫెసర్ | 786 | 1,50,000 |
| అసిస్టెంట్ ప్రొఫెసర్ | 1459 | 1,25,000 |
| సీనియర్ రెసిడెంట్స్ | 1201 | 92,575 |
| ట్యూటర్స్ | 412 | 55,000 |

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

# లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్ల ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**• కవి, గాయకుడు అందెశ్రీ**

తొర్రూరు, మార్చి 12 : తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కవి, గాయకుడు అందెశ్రీ కోరారు. మంగళవారం తొర్రూరులోని వందేమాతరం ఫౌండేషన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి పరీక్షల శిక్షణ పొందుతున్న విద్యార్థుల ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత 20ఏళ్లుగా వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకుడు రవీందర్‌రావు చేస్తున్న కృషి అభినందనీయం అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను ఎంచుకుంటేనే, వారి తల్లిదండ్రుల కల నెరవేరుతుందని అప్పుడే తెలంగాణ రాష్ట్రం నిర్మితమవుతుందన్నారు. ఇతర దేశాలకు వెళ్లి స్థిరపడితే చదవిన పాఠశాలను, పెరిగిన గ్రామాన్ని పట్టించుకునే వారు



సమావేశంలో మాట్లాడుతున్న అందెశ్రీ

ఉండరని, వారు స్థానికంగా ఉండి బడుగు విద్యార్థుల జీవితాలను బాగు చేయాలని తెలిపారు. ఫౌండేషన్‌లో చదువుతో పాటు విలువలు, సంస్కార జీవిత సందేశం, జీవితంలో ఉన్నత స్థాయిలో నిలబడేందుకు చేపడుతున్న ఆలోచనా విధానాలు ఎంతో గొప్పవన్నారు. ప్రభుత్వ బడిపిల్లలు ప్రతిభ గల పిడుగులు అని, ప్రతీ ఒక్కరు వారికి సహకరించి పోరాడాలని తెలిపారు. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులందరూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తాను రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించడం అభినందనీయం అన్నారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి వారి దీవెనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నోడల్ ఉపాధ్యాయులు మాంకాళి బుచ్చయ్య బుదారపు శ్రీనివాస్, ఎంపీపీ అనిమిరెడ్డి, సంస్థ కోఆర్డినేటర్‌లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు కాదు.. ట్యాబ్‌లు ఇవ్వండి

**• సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్**

మహబూబాబాద్ టౌన్, మార్చి12 : అంగన్‌వాడీలను అవినీతిపరులుగా చిత్రీకరించేలా ఆయాకేంద్రాల్లో సీసీ కెమెరాలను పెట్టే ఆలోచనను విరమించుకుని, కుటుంబ సర్వేకోసం 5జీ డేటా టెక్నాలజీ ట్యాబ్‌లను అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఎదుట సీఐటీయూ అనుబంధ టీఎస్ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టే ఆలోచనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

స్నేహబిందు, బెస్త సంపూర్ణ, సరోజ, స్వరూప, తిరుపతమ్మ, మంగమ్మ, రఫియా,సంధ్యారాణి, శైలజ,జ్యోతి, మౌనిక, నాగన్న, మల్లయ్య, దుర్గారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు

## 'శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు'

గూడూరు, మార్చి 12 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊపేక్షించేదిలేదని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు హెచ్చరించారు. బొద్దుగొండ, పొనుగోడు పోలింగ్ కేంద్రాలను మంగళవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఆయన వెంట గూడూరు సీఐ బాబురావు ఉన్నారు.

## డీఎఫ్‌వోను కలిసిన ఎఫ్ఆర్వో సురేష్

గూడూరు, మార్చి 12 : అటవీశాఖ జిల్లా అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విశాల్‌ను గూడూరు రేంజ్ అధికారి సురేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

**పారదర్శకంగా విధులు నిర్వహించాలి..**

గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని క్షేత్రస్థాయి అధికారులు పారదర్శకంగా పనిచేయాలని ఎఫ్ఆర్వో సురేష్ అన్నారు. గూడూరు అటవీశాఖ కార్యాలయంలో బీట్, సెక్షన్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

## జలం.. జటిలం

(5వ పేజీ తరువాయి)

నీటిని గట్టుమీద ఉన్న మరో మడుగులోకి నీటిని నింపుకొని, వరి పొలాలను పారించుకుంటున్నారు. వరితోపాటు చివర సమయంలో వేసిన మొక్కజొన్న పంటకు కూడా నీటి ఇబ్బందులు తప్పడం లేదు. నర్సింహులపేట మండలంలో ఆకేరువాగు ఎండిపోవడంతో పొక్లెయిన్‌లతో వాగుల్లోనే నీటి కుంటలు తవ్వుతున్నారు. ఆ నీటి కుంటల్లో నీటిని పంపింగ్ చేసి పొలాలకు పారించుకుంటున్నారు. దీంతో రైతులు నీటి కోసం అరిగోస పడుతున్నారు.

**మరో పది రోజుల్లో..**

మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి ప్రాంతాల నుంచి వెళ్లే ఎస్సారెస్పీ డీబీఎం-48 మెయిన్ కెనాల్ ఈనెల 23వ తేదీ నుంచి నీటి సరఫరా బంద్ అవుతోంది. ఎస్సారెస్పీ డీబీఎం-60 మెయిన్ కెనాల్‌కు తొర్రూరు ప్రాంతం నుంచి వెళ్తుంది. ఈ కెనాల్ ఏప్రిల్ 1 నుంచి బంద్ అవుతుందని నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి డీబీఎం-48, జనవరి 8 నుంచి డీబీఎం -60కి నీరు విడుదల చేశారు. ముందు మంచిగానే నీరు విడుదల అయినప్పటికి రానురాను నీటి విడుదల భారీగా తగ్గిపోయింది. ఫిబ్రవరి నెలలో డీబీఎం-48 కెనాల్‌లో 1200 క్యూసెక్కులు నీరు విడుదల చేయాల్సి ఉండగా, కేవలం 175 నుంచి 185 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలైంది. దీంతో చివరి ఆయకట్టు గ్రామాలకు నీరు వెళ్లలేదు. కాలువల ముందున్న రైతులు మాత్రం నీటిని అధికంగా వాడుకున్నప్పటికి చివరి గ్రామాల రైతులు నీటిని వాడుకోలేదు. వచ్చే 10-15 రోజుల్లో తీవ్ర నీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

# దాతలు సహకరిస్తే.. ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తా



సౌత్‌ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహిస్తున్న భూక్యా యశ్వంత్ (ఫైల్)

**• మౌంటెనర్ భూక్యా యశ్వంత్**

మరిపెడ, మార్చి 12 : దాతలు సహకరిస్తే, ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహిస్తానని మౌంటెనర్ భూక్యా యశ్వంత్ అన్నారు. మంగళవారం మరిపెడలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రపంచంలోని ఫేమస్ పర్వతాలైన కిలిమంజారో (సౌత్ ఆఫ్రికా), ఎల్బ్రోస్ (రష్యా, యూరప్), కోసియాస్కో (ఆస్ట్రేలియా), యోనాం, ఖార్డుంగులా (ఇండియా) అధిరోహించానని తెలిపారు. ఎవరెస్ట్ పర్వతాన్ని సైతం ఎక్కి, తన లక్ష్యసాధనను ఛేదించేందుకు కసరత్తు పూర్తి చేశానని వివరించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు నిపుణుల వద్ద శిక్షణ పొంది, ఏప్రిల్ 5న ఎవరెస్ట్ పర్వత శిఖరాలను చేరుకునేందుకు ఎంతో ఉత్సాహంతో ఉన్నప్పటికీ పేదరికం, ఆర్థిక సమస్యలు వేధిస్తున్నాయన్నారు. ఈ ఎవరెస్ట్ పర్వతారోహణకు రూ.40 లక్షలు ఖర్చువుతుండగా, వివిధ కంపెనీలతో పాటు.. పలు రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, ఆఫీసర్లు రూ.15 లక్షల వరకు అందచేసినట్లు తెలిపారు. ఇంకా రూ.25 లక్షలు సమకూరితేనే తన ప్రయత్నం సక్సెస్ అవుతుందన్నారు. పెద్దమనసుతో దాతలు తనను ఆశీర్వదిస్తే, ఎవరెస్ట్ శిఖరానికి చేరుకొని జాతీయజెండాను ఎగిరేస్తానని యశ్వంత్ ధీమా వ్యక్తం చేశారు. దాతలెవరైనా సహాయం చేయదలిస్తే 70750 13778 సెల్ నంబరుకు ఫోన్‌చేసి, తమ దాతృత్వం చాటుకోవాలని వేడుకున్నారు.

## రైల్వే ప్లాట్‌ఫాంపై స్టాల్ ప్రారంభం

కేసముద్రం, మార్చి 12 : కేసముద్రం రైల్వేస్టేషన్ డౌన్‌ప్లాట్‌పై ప్రయాణీకుల సౌకర్యార్థం 'ఒక స్టేషన్-ఒక ఉత్పత్తి' కార్యక్రమంలో భాగంగా ఇస్లావత్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ స్టాల్‌లో డ్రై ఫ్రూట్స్, బిస్కెట్స్ తదితర తినుబండారాలు లభిస్తాయని నిర్వాహకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకుడు వోలం శ్రీనివాస్, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నెహ్రూసెంటర్, మార్చి 12 : మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-2పై గుర్తు తెలియని వ్యక్తిమృతి చెందినఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్, మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మాస్టర్ తెలిపిన వివరాల ప్రకారం. ప్లాట్‌ఫాం-2పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని, అతని వయస్సు సుమారు 30 సంవత్సరాల వరకు ఉంటుందని తెలిపారు. మృతుడి ఒంటిపై నిలువు తెల్లటి గీతలు కలిగిన బ్రౌన్‌కలర్ ఫుల్‌షర్ట్, నలుపురంగు ప్యాంటు ధరించిఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఖమ్మం మార్చురీకి అన్నం సేవా సమితి సహకారంతో తరలించినట్లు తెలిపారు. ఈ మృతుడినిఎవరైనా గుర్తుపడితే డోర్నకల్ జీఆర్పీ ఎస్సై : 8712658600 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## టౌన్ పోలీస్ స్టేషన్‌లో వాహనాల తనిఖీ

మహబూబాబాద్ రూరల్, మార్చి 12 : మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫోర్, టూ వీలర్‌ల వాహనాలను ఆకస్మికంగా ఎంటీఓఆర్ఐ బానోత్ సోమునాయక్ తనిఖీ చేశారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జిల్లా ఎస్పీ సుధీర్‌సోమ్‌నాథ్ ఆదేశాల మేరకు పోలీస్‌వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈకార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌ప్రతాప్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు'

మరిపెడ రూరల్, మార్చి 12 : ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తొర్రూర్ డీఎస్పీ సురేష్ ఇసుక అక్రమ రవాణాదారులను హెచ్చరించారు. మంగళవారం రాంపూర్ శివారు బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం డీఎస్పీ మాట్లాడారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి బాగా ఉందన్నారు. పాలేరు వాగు నుంచి కొందమంది అర్ధరాత్రి వేళల్లో ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తండా ధర్మారంలోని పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సీఐ హతీరాం, ఎస్సై తాహెర్‌బాబా పాల్గొన్నారు.

## నేరస్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి : ఎస్సై

పెద్దవంగర, మార్చి 12 : నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్సై మహేష్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లపై ఉన్న పాతకేసుల పూర్వాపరాలను పరిశీలించి, వారికి ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్, డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. ఏఎస్సై కుమారస్వామి, సిబ్బంది ఉన్నారు.

## రైలులో సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలి

చిన్నగూడూరు, మార్చి12 : ప్రయాణీకుల భద్రత, సుఖమైన ప్రయాణం కోసం ప్రతీ రైలులో ఐదుబోగీలను సంబంధిత రైల్వేశాఖ ఏర్పాటు చేయాలని, ప్రధానమంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ కార్యక్రమాన్ని తొలుత మండలకేంద్రంలోని దాశరథి సెంటర్‌లోమంగళవారం ప్రారంభించినట్లు సాధారణబోగీల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరికపండ్ల అశోక్ తెలిపారు. ఈ ఉద్యమానికి మద్దతుగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్, చంద్రయ్య, నరేష్, నారాయణ, శ్రీను, అశోక్, కిషన్, ఉత్తరాలు రాసి పోస్ట్ డబ్బాలో వేశారన్నారు.



మునిసిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్

## పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

**• కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్**

మహబూబాబాద్ టౌన్, మార్చి 12 : రంజాన్ మాసం ప్రారంభమైన దరిమిలా ముస్లింలు ప్రార్థనలు చేసే మసీదులు, వారి నివాస ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ రవీందర్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ నెల రోజుల పాటు మసీదుల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. నీటి ఎద్దడి ఉన్న మసీదులకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. పందులు, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవడంతోపాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. నజీర్, జాకీర్ హుస్సెన్, మక్బూల్, సాబీర్, నయీమ్, నదీమ్‌ఖాన్ పాల్గొన్నారు.

## విజయ సంకల్ప మహాసమ్మేళనానికి తరలిన బీజేపీ శ్రేణులు

పెద్దవంగర, మార్చి 12 : హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన ఏర్పాటు చేసిన విజయ సంకల్ప మహా సమ్మేళనానికి బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం మండలం నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈసందర్భంగా జిల్లాఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్, ఎంపీటీసీ సాయిని ఝాన్సీ మాట్లాడుతూ గ్రామాలలో బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేస్తూ బీజేపీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉడుత శ్యామ్, అనంద్, వెంకన్న, రంగు శ్రీను, సుధాకర్, కుమార్, నవీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిర్మూలనకు అందరూ కృషి చేయాలి : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి12 : ప్లాస్టిక్ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సూచించారు. జిల్లా కేంద్రంలోని మార్గదర్శి బీ.ఎడ్ కళాశాలలో మంగళవారం జిల్లా విద్యాశాఖ, నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో 'సింగల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు' అనే అంశంపై ఉన్నత పాఠశాలల విద్యార్థులకు డ్రామా, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు సృజనాత్మక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విస్తృతప్రచారం నిర్వహించి ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్లలో వాడే శుభకార్యాల్లో ప్లాస్టిక్ వాడటానికి బదులుగా కాగితపు, ఆకు వస్తువులు వినియోగించుకోవాలని కోరారు. ఏకపాత్రాభినయం పోటీల్లో మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా నగదు బహుమతిగా రూ. 3 వేలు అందించారు. మానుకోట కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ద్వితీయ స్థానంలో నిలువగా రూ.2 వేలు, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ నర్సింహులపేట తృతీయ స్థానంలో నిలువగా రూ.వెయ్యి అందచేశారు. డ్రామా పోటీల్లో మానుకోట కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ప్రథమ స్థానంలో నిలువగా రూ. 3వేలు, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ నర్సింహులపేట ద్వితీయ స్థానంలో నిలువగా రూ. 2 వేలు, మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలువగా రూ. వెయ్యి అందజేయడంతో పాటు ప్రశంసా పత్రాలనుఅందజేశారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి బీ.ఎడ్ కళాశాల డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి, ఎన్‌జీసీ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, ఏఎంవో చంద్రశేఖర్‌ఆజాద్, ఏఎస్‌డబ్లూవో విత్తనాల సుధాకర్, ఎన్‌జీసీ సమన్వయకర్త గురునాథరావు, శ్యామలాదేవి, యుగందర్, బాలాజీ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## 'పారదర్శకంగా పనులు చేయాలి'

తొర్రూరు రూరల్, మార్చి 12 : ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలు పారదర్శకంగా పనులు చేయాలని ఎంపీడీవో సిలార్‌సాబ్ అన్నారు. మంగళవారం అమ్మాపురంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసే నర్సరీని పరిశీలించి హరితహారం కార్యక్రమంలో నర్సరీలో పెంచే ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. ఏపీవో మధు, ఫీల్డ్ అసిస్టెంట్ యాకయ్య, కూలీలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌ను వీడుతున్నారంటూ తప్పుడు ప్రచారం..

**• పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ నజీర్‌అహ్మద్**

కేసముద్రం, మార్చి 12 : మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ బీఆర్ఎస్‌ను వీడి, మరో పార్టీలోకి వెళుతున్నారంటూ కొంతమంది నాయకులు మీడియా సంస్థలకు తప్పుడు సమాచారం ఇచ్చి, ప్రచారం చేయిస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ నజీర్‌అహ్మద్ ఆరోపించారు. కేసముద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మీడియా చానళ్లకు కొంతమంది తప్పుడు సమాచారం ఇచ్చి చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారని, ఈ ప్రచారాన్ని నాయకులు, కార్యకర్తలెవరూ నమ్మవద్దని తెలిపారు.

## ఘనంగా గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ

డోర్నకల్, మార్చి 12 : మండలంలోని వెన్నారం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన ఆవరణలో స్వామివారి జీవధ్వజ మహాగణపతి, శ్రీముత్యాలమ్మ, నాగేంద్రస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహ, శివలింగ, కట్టమైసమ్మల విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకను సోమవారం నుంచిప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం విశ్వక్సేనపూజ, పుణ్యాహం, అగ్నిధ్యానం, విశేషహోమాలు నిర్వహించారు. అనంతరం జలబిందెలతో ఊరేగింపు, ధ్వజస్తంభాభిషేకం, హారతి, తీర్థప్రసాదగోష్టి నిర్వహించారు. సాయంత్రం ప్రభుతబలి, కుంభారాధన, మహాశాంతి హోమం, హారతి, తీర్థప్రసాదగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## నేడు కల్యాణ వీరభద్రుడి రథోత్సవం

కురవి, మార్చి 12 : భద్రకాళి సమేత వీరభద్రస్వామి కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజు బుధవారం సాయంత్రం 6.00 గంటలకు వీరభద్రుని రథోత్సవం జరుగనుంది. వీరభద్రస్వామిని, భద్రకాళిమాతను ఊరేగించేందుకు దాదాపు 70 ఏళ్ల క్రిందట చెక్కతో ఈ రథాన్ని చేయించారు. 30 ఫీట్ల ఎత్తున్న ఈ రథంలో వీరభద్రుడి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఇంతపెద్ద చెక్కరథం ఈ ప్రాంతంలో ఒక్క వీరభద్రస్వామి ఆలయంలో మాత్రమే ఉంది. ఈ పురాతన కాలపు రథాన్ని స్వామివారి రథోత్సవం కోసం ఆలయ సిబ్బంది రంగులు, వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తారు. రథోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఈవో సత్యనారాయణ, చైర్మన్ కొర్ను రవీందర్ తెలిపారు. రథాన్ని లాగితే చేసిన పాపాలు తొలగుతాయని, కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. దీంతో రథోత్సవానికి ప్రతీ సంవత్సరం భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు.

## 'రంజాన్‌ను సోదరభావంతో జరుపుకోవాలి'

కొత్తగూడ, మార్చి12 : రంజాన్ మాసం వేడుకలను సోదరభావంతో ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని ఎస్సై దిలీప్ సూచించారు. కొత్తగూడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ముస్లిం కమిటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ పలుసూచనలు చేశారు. రంజాన్ మాసంలో నిర్వహించుకునే కార్యక్రమాలకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనంతరం ముస్లిం, మైనారిటీ మజిద్ ఏ అర్వాత్ కమిటీ సభ్యులు ఎస్సైను సన్మానించారు. సమావేశంలో ముస్లిం మైనారిటీ మజిద్ ఏ అర్వాత్ కమిటీ అధ్యక్షుడు అజ్మీర్, మతగురువు ముదాస్సిర్, ముఖ్యసలహాదారుడు యాకూబ్ పాష, సభ్యులు యాకూబ్‌పాష, మౌలానా, ఖాజామియా, సర్వర్, అఫ్జల్, సద్దాం, అంజాద్, అక్బర్, ఏజాజ్ పాల్గొన్నారు.

## కొత్తపేటలో తోపుడు బండ్లు పంపిణీ

**• హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య, ప్రజాకవి జయరాజ్**

బయ్యారం, మార్చి 12 : కొత్తపేటలో మంగళవారం పలువురికి తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, ల్యాప్ టాప్‌లు పంపిణీ చేశారు. చేతన్ ఫౌండేషన్ నిర్వాహకులు నిరుపేదలకు సహాయార్థం 50 తోపుడు బండ్లు, 5 కుట్టు మిషన్లతో పాటు ఇరువురు బీద విద్యార్థులకు రెండు ల్యాప్‌టాప్‌లు వితరణగా ఇచ్చారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ప్రజా కవి జయరాజ్ చేతుల మీదిగా పేదలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా మంది డబ్బులు సంపాదిస్తుంటారు.. కానీ, సేవ చేసే గుణం కొందరికే ఉంటుందన్నారు. అనంతరం ప్రజా కవి జయరాజ్ మాట్లాడుతూ చేతన్ ఫౌండేషన్ సేవలు అమోఘమని కొనియాడారు. ప్రకృతి, మానవ జీవన శైలి గురించి మాట్లాడి సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బయ్యారం వైస్ ఎంపీపీ తాతా గణేష్, స్థానికులు సురేష్, నవీన్, రషీద్, పాల్గొన్నారు.



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, ప్రజా కవి జయరాజ్

## నర్సిరెడ్డికి గ్రామస్థుల సన్మానం

సీరోలు, మార్చి 12 : మండలంలోని కాంపల్లిలో తొలిసారిగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాపొందిన చింతకుంట్ల నర్సిరెడ్డిని స్నేహితులు, గ్రామస్థులు సన్మానించారు. కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొందిలి వెంకన్న, కొంపెల్లి బిక్షం మాట్లాడారు. గ్రామంలో తొలి పీహెచ్‌డీ పట్టా పొంది అందరికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాలలో ఇంగ్లీష్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్‌గా విధులు నిర్వహిస్తూనే.. పీహెచ్‌డీ పూర్తి చేయడంఅభినందనీయమన్నారు. హెచ్ఎం అరుణశ్రీ, ఉపాధ్యాయులు కె.శంకర్, గ్రామ పెద్దలు తోట రమేష్, పెద్ది వెంకన్న, బత్తిని వెంకన్న, కేలోతు అర్జున్‌చౌహాన్ పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



మూతి రాజు (ఫైల్)

గార్ల మార్చి 12 : మండలంలోని శేరిపురంలో ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. ఎస్సై జీనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. శేరిపురం గ్రామానికి చెందిన మూతి రాజు (55) మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈనెల 11వ తేదీన జరుగగా, రాత్రి తనఇంటి డాబాపై పడుకుంటానని చెప్పి, పైకి వెళ్లాడు. ఎంత పిలిచినా కిందకు రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లిచూసే సరికి పురుగుల మందు తాగి, నురగలు కక్కడంతో వెంటనే గార్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్సను జరిపించారు. పరిస్థితి విషమించంతో మెరుగైన వైద్య కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, రాజు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె మూతి కల్యాణి ఫిర్యాదు మేరకు ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

**అవుసలితండాలో ఒకరు..**

కేసముద్రం, మార్చి 12 : మహమూద్‌పట్నం శివారు భూక్యాతండా పరిధిలోని అవుసలితండాకు చెందిన బానోత్ బిచ్యా(44) క్రిమిసంహారక మందు తాగి చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. మంగళవారం మృతుడి తల్లి చిలుకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనారోగ్యం, కుటుంబసమస్యలతో ఈనెల 6న ఉదయం తండాలో బిచ్యా క్రిమిసంహారక మందు సేవించగా కుటుంబ సభ్యులు ఆయన్ను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందగా మంగళవారం ఉదయం మృతుని తల్లి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య సరోజ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం ఉన్నట్లు ఎస్ఐ వివరించారు.

**దంతాలపల్లిలో ఉరి వేసుకొని ..**



చీకటి రాములు (ఫైల్)

దంతాలపల్లి, మార్చి12 : మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం. దంతాలపల్లికి చెందిన చీకటి రాములు (48) తన ఇద్దరు కుమారులతో నివాసముంటున్నాడు. రాములు గత కొద్దికాలంగా మండల కేంద్రం శివారులోని ఓ తోట మాలీకి పాలేరుగా పని చేస్తున్నాడన్నాడు. ఎనిమిదేళ్లగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య సూర్యాపేట జిల్లా కేంద్రంలో నివాసం ఉంటోంది. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి చెందిన రాములు ఉదయం మామిడి తోటలో చెట్టుకు తాడుతో ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం కోసం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## బయ్యారంలో ఛీటింగ్ కేసు నమోదు

బయ్యారం, మార్చి 12 : తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ డబ్బులు వసూల్ చేసి, పలువురిని మోసం చేసిన ఘటనలో మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చేతన్‌నితన్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌హెచ్‌వో పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం. చోక్లాతండాకి చెందిన వెంకటసాయి కృష్ణ తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానంటూ బాలాజీపేట గ్రామానికి చెందిన పాల్తియ మోహన్ వద్ద డబ్బులు వసూల్ చేశాడు. దీంతో పాటు ఓప్రైవేట్ ఫైనాన్స్ వద్ద కుదువ పెట్టిన బంగారాన్ని సైతం తనకు తెలవకుండా వెంకటసాయి కృష్ణ తీసుకెళ్లాడని, తనతో పాటు ఇదే తరహాలో మరి కొంతమంది వద్ద కూడా డబ్బులు వసూల్ చేసి వెంకటసాయి కృష్ణ మోసానికి పాల్పడినట్లు బాధితుడు తన ఫిర్యాదు పేర్కొన్నారు. బాధితుడు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పోలీసులు తెలిపారు.

## 'తునికాకు టెండర్లను పూర్తి చేయాలి'

గూడూరు, మార్చి 12 : తునికాకు టెండర్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండలం బ్రహ్మణపల్లిలో మంగళవారం బుడిగె వెంకటయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నాయకులు మల్లేష్, కొమురమల్లు, వెంకటరామనర్సయ్య, శ్రీరాములు, వెంకటయ్య, కుమార్, రాజు, స్వామి, ప్రశాంత్, సురేష్, రవి పాల్గొన్నారు.